క్లుప్తంగా

వెంకన్నకు పంచామృతాభిషేకం



పెందుర్తి: వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

అప్పన్న సన్నిధిలో దేవదాయ కమిషనర్

సింహాచలం: సింహగిరికి వచ్చిన దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ సతీసమేతంగా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను, శేషవస్త్రాన్ని అందజేశారు.

డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ యువజన విభాగం, క్రీడా బోర్డు ఆధ్వర్యంలో జాతీయ సేవా సమితి(ఎన్ఎస్ఎస్) వలంటీర్లకు, విద్యార్థులకు మత్తు పదార్థాల నివారణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి మాట్లాడుతూ మత్తు పదార్థాల తయారీకి దోహదపడే వృక్షాలు, వాటి పెంపకం, పర్యవసానాలపై విద్యార్థులకు వివరించారు. నెహ్రూ యువ కేంద్రం విభాగం నుంచి వచ్చిన ఆర్.లీలాప్రసాద్ రెడ్డి విద్యార్థుల్లో చైతన్యం తీసుకొచ్చేలా మాట్లాడారు. మత్తు పదార్థాల జోలికి విద్యార్థులు వెళ్లకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, అలాంటి వారిని గుర్తించడమెలా? తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శంకర్, అధ్యాపకులు గోవిందరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.


మతిస్థిమితం లేని వృద్ధురాలు బంధువులకు అప్పగింత



రమణమ్మను బంధువులకు అప్పగిస్తున్న పెందుర్తి పోలీసులు

పెందుర్తి: ఇంటి నుంచి తప్పిపోయిన మతిస్థిమితం లేని ఓ వృద్ధురాలిని పెందుర్తి పోలీసులు బంధువులకు అప్పగించారు. వివరాలివి. వేపగుంట సమీపంలోని కృష్ణరాయపురం టీచర్స్ లేఅవుట్ ప్రాంతంలో ఓ వృద్ధురాలు వీధుల్లో తిరుగాడుతుండటాన్ని స్థానికుడు శ్రీనివాస్ పోలీసులకు సమాచారం అందించాడు. దీనిపై సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు బ్లూకోట్స్ పీసీ ఎం.గోవింద్ ఆమెను విచారించారు. ఆమె చెప్పిన వివరాల ప్రకారం గొల్ల కంచరపాలెం నివాసిగా గుర్తించి, కంచరపాలెం పోలీసులకు సమాచారం అందించారు. అక్కడి పోలీసులు సదరు వృద్ధురాలి చిరునామా తెలుసుకుని ఆమెను రమణమ్మగా గుర్తించారు. అనంతరం రమణమ్మను మనవడు ప్రసాద్, మేనల్లుడు అజయ్‌లకు అప్పగించారు.

అథ్లెటిక్స్‌లో బాలభారతి స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న ఎన్టీపీసీ జీజీఎం సిన్హా

పరవాడ: ఢిల్లీలో చైల్డ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19 వరకు జరిగిన 15వ అఖిల భారత ఇంటర్ యూనిట్ స్పోర్ట్స్ మీట్–2024 పోటీల్లో సింహాద్రి ఎన్టీపీసీ బాలభారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచారు. అథ్లెటిక్స్ బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన బి.సంధ్యారాణి 400, 800 మీటర్ల పరుగులో బంగారు పతకాలు, 1500 మీటర్ల పరుగులో రజత పతకం సాధించింది. పాఠశాలకు చెందిన డింపుల్ లక్ష్మి, సాయి రాగిణి, శరణ్యారెడ్డి, బి.సంధ్యారాణి రిలే పరుగులో రజత పతకాలు సాధించారు. విజేతలను ఎన్టీపీసీ జీజీఎం ఎస్.కె.సిన్హా అభినందించారు.

2015..

టీడీపీ ప్రభుత్వంలో పెందుర్తి మండలం దువ్వపాలెంలో టీడీపీ నాయకుల ప్రోద్బలంతో గ్రామంలో బెల్ట్ షాపునకు బహిరంగ వేలం నిర్వహించారు. నెలకు రూ.20 వేలు చెల్లించేలా ఓ వ్యక్తి బెల్ట్ షాపును దక్కించుకున్నాడు. అదే స్ఫూర్తిగా జిల్లాలోని ఇతర గ్రామాల్లో కూడా టీడీపీ నాయకుల కనుసన్నల్లో బెల్ట్ దుకాణాలను బార్లా తెరిచారు.

2019..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. నియోజకవర్గంలో మద్యం బెల్ట్ దుకాణాలకు పూర్తిగా చెక్. అడపాదడపా కొందరు అమ్మకాలు సాగించినా సెబ్ అధికారులు ఐదేళ్ల పాటు వాళ్ల ఆటలు సాగకుండా నియంత్రించగలిగారు. వారికి అండగా నిలుస్తున్న వారిపైనా కఠిన చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామాల్లో బెల్ట్ దుకాణాలను దాదాపు కనుమరుగయ్యాయి.



గవరజగ్గయ్యపాలెంలో గురువారం రాత్రి పట్టుబడిన బెల్ట్ దుకాణంలో మద్యం

'బెల్ట్' పాటకు వేళాయె!

- గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపుల వేలం పాటకు రంగం సిద్ధం
- నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పెద్దల సమక్షంలో రేపు వేలం
- సిండికేట్, కూటమి నాయకుల ఆధ్వర్యంలోనే బెల్ట్ దుకాణాల నిర్వహణ
- పల్లెల్లో మద్యం ఏరులై పారించేందుకు ఏర్పాట్లు చేస్తున్న కూటమి నాయకులు

పెందుర్తి:

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉన్న ఊరు దాటాల్సిన పనిలేకుండా పౌరసేవలన్నీ సచివాలయ కేంద్రంగా అందించారు. ఆ రోజులు పోయాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉన్న ఊరు కాదు కదా.. వీధి కూడా దాటాల్సిన పనిలేకుండా మద్యం మన ముంగిట్లోకే తెచ్చే ఏర్పాట్లు చేస్తోంది. వీరి చర్యలతో ఐదేళ్ల విరామం తర్వాత గ్రామాల్లో మద్యం దుకాణాలకు జవసత్వాలు చేకూరుతున్నాయి. మద్యం బెల్ట్ షాపులకు ఊపిరిపోసేందుకు సిండికేట్‌తో కలిసి అధికార టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి నాయకులు సర్వసన్నద్ధమయ్యారు. పేద, దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి ప్రజల్ని ఆర్థికంగా కునారిల్లజేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

సిండికేట్‌దే రాజ్యం

వాస్తవానికి మద్యం దుకాణాల నిర్వహణ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాక, ఇప్పటికే పలు చోట్ల మద్యం బెల్ట్ షాపులు వెలిశాయి. కొన్ని గ్రామాల్లో అమ్మకాలు కూడా జోరందుకునానయి. వాస్తవానికి కూటమి నాయకులతో కలిసి ప్రైవేట్ దుకాణాల యజమానులే ఈ బెల్ట్ షాపుల్ని ప్రోత్సహిస్తున్నారు. వారి దుకాణాల్లో మద్యం సేల్స్ పెరగాలంటే బెల్ట్ దుకాణాల ద్వారా ఇంటి ముంగిటకే మద్యాన్ని చేరువ చేయాలన్నది వారి వ్యాపార సూత్రం. 2014–2019 వరకు టీడీపీ హయాంలో ఇదే జరిగింది. ఆ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి మద్యం వినియోగదారులను ఇష్టానుసారం దోచుకున్నారు. విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలను ప్రోత్సహించి.. నిర్వాహకుల చెంతకే మద్యాన్ని సరఫరా చేసి మరీ, సేల్స్ పెంచారు.

గత ఐదేళ్లలోనే కట్టడి

2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రైవేట్ మద్యం పాలసీని రద్దు చేసింది. బెల్ట్ షాపుల్ని కూడా పూర్తి నియంత్రణలో ఉంచిన విషయం తెలిసిందే. ఐదేళ్లూ టీడీపీకి చెందిన మద్యం సిండికేట్లు కక్కలేక, మింగలేక అన్నట్లుగా ఉన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, మద్యం వ్యాపారాన్ని మళ్లీ ప్రైవేట్ పరం చేయడంతో, మద్యం షాపులన్నీ దాదాపు సిండికేట్ల చేతుల్లోకే వెళ్లిపోయాయి. దీంతో మళ్లీ సిండికేట్ వ్యాపారులు గ్రామాల వేపు మద్యాన్ని ఏరులై పారించేందుకు సిద్ధమయ్యారు. తమతోపాటు ప్రభుత్వాన్ని కూడా మద్యం ఆదాయంతోనే నడిపేలా సాయపడుతున్నారు. అందుకోసమే ఆదివారం నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో వేలం పాట నిర్వహించనున్నారని తెలిసింది.



సబ్బవరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్

రేపు బహిరంగ వేలం!

గ్రామాల్లో బెల్ట్ దుకాణాల హక్కులు కట్టబెట్టేలా ఆదివారం వేలం పాట నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే గ్రామాల్లో సిండికేట్ మద్యం వ్యాపారులతో కలిసి 'కూటమి'పెద్దలు తమ అనుయాయులకు బెల్ట్ దుకాణాలు దక్కేలా రంగం సిద్ధం చేశారు. పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాల్లోని 90 శాతం పంచాయతీలతో పాటు జీవీఎంసీ పరిధిలోని పలు కాలనీల్లో కూడా మద్యం బెల్ట్ దుకాణాల నిర్వహణకు ఆదివారమే వేలం వేయనున్నట్లు తెలిసింది. బెల్ట్ దుకాణాలకు మద్యం నేరుగా సరఫరా చేసేలా ఇప్పటికే లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల యజమానులు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు సమాచారం. కొన్ని గ్రామాల్లో వారి సమక్షంలోనే వేలం పాటలు నిర్వహిస్తారని వినికిడి.

'బెల్ట్'తీస్తాం



లైసెన్స్ ఉన్న మద్యం దుకాణాల్లో మాత్రమే నిబంధనల ప్రకారం మద్యం విక్రయాలు జరగాలి. బెల్ట్ దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు చేస్తే ఖచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే బెల్ట్ దుకాణాలపై దాడులు ప్రారంభించాం. గ్రామాల్లో బెల్ట్ దుకాణాల ఏర్పాటుకు వేలం పాట విషయం మా దృష్టికి రాలేదు. దీనిపై ప్రజలు సమాచారం ఇస్తే తక్షణమే చర్యలు తీసుకుంటాం.

– కె.వి.సతీష్‌కుమార్, సీఐ, లా అండ్ ఆర్డర్, పెందుర్తి

తప్పకుండా చర్యలు



బెల్ట్ దుకాణాల ఏర్పాటుపై ప్రస్తుతానికి మాకు ఎలాంటి సమాచారం లేదు. గ్రామాల్లో అనధికారికంగా మద్యం విక్రయించడం చట్టరీత్యా నేరం. కాబట్టి ఎక్కడ బెల్ట్ దుకాణం నిర్వహించినా ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం. నిర్వాహకులను అరెస్ట్ చేస్తాం. ప్రజలు కూడా బెల్ట్ దుకాణాల నియంత్రణ విషయంలో మాకు సహకరించి, సమాచారం అందిస్తూ ఉండాలి.

– డి.అనిల్‌కుమార్, సీఐ, ఎక్సైజ్

పంచగ్రామాల భూసమస్య పరిష్కరించాలని వినతి



విష్ణుకుమార్‌రాజుకి వినతిపత్రం అందిస్తున్న సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం నాయకులు

సింహాచలం: సింహాద్రి అప్పన్న దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచగ్రామాల భూసమస్యకు పరిష్కారం చూపాలని విశాఖ ఉత్తర నియోజకర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. పంచగ్రామాల్లో తమకున్న హక్కులను వివరించారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే విజయవాడలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు నాయకులు వెల్లడించారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో సంఘం కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు, నాయకులు వీబీఎస్ ప్రతాప్, రాము, బాలరాము ఉన్నారు.

అలివేలు మంగమ్మ సన్నిధిలో కుంకుమ పూజలు



పూజలందుకున్న అలివేలు మంగమ్మ

పెందుర్తి: చినముషిడివాడ సమీపంలోని సప్తగిరినగర్‌లో కొలువుదీరిన అలివేలు మంగమ్మ సన్నిధిలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి విశేష అభిషేకాలు జరిపి, వివిధ రకాల పూలమాలలతో అలంకరణ చేశారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక కుంకుమ పూజలు జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

పేదల నడ్డి విరుస్తున్న కూటమి ప్రభుత్వం



ధరల పెరుగుదలపై చినముషిడివాడ కూడలి వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నేతలు, ప్రజలు



కూటమి ప్రభుత్వ తీరుపై ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు

- చినముషిడివాడలో సీపీఐ ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ, ర్యాలీ

పెందుర్తి: వసూళ్లు.. దోపిడీలు తప్ప కూటమి ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం పట్టడం లేదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ విమర్శించారు. ఎన్నికల సమయంలో నిత్యవసరాల ధరలు పెరగకుండా ప్రజలకు అండగా ఉంటామని చెప్పి గద్దెనెక్కిన టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రజల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు.

సీఎం చంద్రబాబు పాలనలో సామాన్యులు కడుపు నిండా తినే పరిస్థితి కూడా లేదని ఆక్షేపించారు. రాష్ట్రంలో పెరుగుతున్న కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం చినముషిడివాడ కూడలి వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ధరల పెరుగుదలపై ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఓ వైపు కూలి పనుల్లేక లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయి, ఖాళీగా ఇళ్లలో ఉంటే దారుణంగా నిత్యావసర సరకుల ధరలు పెరగడం విచారకరం అన్నారు. విజనరీగా చెప్పుకునే సీఎం చంద్రబాబుకు మోసం తప్ప ప్రజల సంక్షేమం పట్టదని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిత్యావసరాల ధరలను కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలతో కలిసి తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వై.రాంబాబు, పార్టీ ప్రతినిధులు ఎస్.అసిరినాయుడు, ఎం.రాము, దుర్గారావు, మిన్నారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆ కార్పొరేటర్‌ను బీజేపీలో చేర్చుకుంటే సహించం

- మాతో చర్చించకుండా ఎంపీ రమేష్ నిర్ణయం తీసుకోవడం దారుణం
- ముమ్మన దేముడు బీజేపీలో చేరడంపై టీడీపీ, జనసేన నాయకుల అభ్యంతరం



దేముడును బీజేపీలో చేర్చుకోవడాన్ని వ్యతిరేకిస్తూ పోస్టర్లు ప్రదర్శిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

పెందుర్తి: ఐదేళ్ల పాటు అధికారం అనుభవించి.. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి తరువాత ఆ పార్టీని వీడుతూ బీజేపీలో చేరేందుకు నిర్ణయించిన 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడును పెందుర్తి ప్రాంతానికి చెందిన కూటమి నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం సుజాతనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఓడిన రోజు నుంచీ ముమ్మన దేముడు టీడీపీ, జనసేన పార్టీలోకి రావడానికి ప్రయత్నం చేస్తున్నారని, తామంతా తీవ్రంగా వ్యతిరేకించడంతో ఆగిపోయిందన్నారు. అయితే తాజాగా బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కార్పొరేటర్ ముమ్మన దేముడును బీజేపీలోకి ఆహ్వానించడం తాము జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. మొన్నటి ఎన్నికల్లో కూటమి తరఫున పోటీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఓటమికి కార్పొరేటర్ ముమ్మన దేముడు పనిచేశారని. అతని రాజకీయ జీవితం అంతా అవినీతిమయమని ఆరోపించారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ పంచన చేరుతారని, కాంగ్రెస్, ప్రజారాజ్యం, టీడీపీ, వైఎస్సార్‌సీపీ ఇలా అన్ని పార్టీల్లో చేరారని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తిని ఎంపీ రమేష్ ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. కూటమి ధర్మాన్ని పాటించకుండా, కనీసం మాతో చర్చించకుండా ఎంపీ నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. ఊసరవెల్లిలా పార్టీలు మారుతూ.. వస్తున్న వ్యక్తిని పార్టీలో చేర్చుకోవడంపై ఎంపీ పునరాలోచన చేయాలని కోరారు. సమావేశంలో వార్డు టీడీపీ ఇన్‌చార్జి దాట్ల మధు, జనసేన ఇన్‌చార్జి శానాపతి సోమశేఖర్, టీడీపీ, జనసేన సీనియర్ నాయకులు ఆళ్ల తాతారావు, అయితే ఎర్రిబాబు, బొడ్డు అప్పలరాజు, గొర్లె రామకృష్ణ, పిన్నింటి పార్వతి, రాపర్తి కిషోర్ పాల్గొన్నారు.

ముమ్మన దేముడును బీజేపీలోకి చేర్చుకోవాలన్న నిర్ణయాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత, టీడీపీ సీనియర్ నేత శానాపతి శంకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. కనీసం తమతో చర్చించకుండా ఎంపీ నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. మొన్నటి ఎన్నికల్లో కూటమికి వ్యతిరేకంగా దేముడు పనిచేశారని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీకి దేముడు రాజీనామా:

జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించారు. బీజేపీ విధానాలకు ఆకర్షితుడినై ఆ పార్టీలో చేరుతున్నట్లు వెల్లడించారు.

రెవెన్యూ అర్జీల సత్వర పరిష్కారానికి కృషి

- ఆరిపాక రెవెన్యూ సదస్సులో 59 అర్జీలు



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం: రీ సర్వే తర్వాత కూడా పరిష్కారానికి నోచుకోని పలు భూ సమస్యల్ని పరిష్కరించేందుకే ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని ఆరిపాక శివారు లగిశెట్టిపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. రైతుల అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని భరోసానిచ్చారు. రెవెన్యూ రికార్డుల్లో నెలకొన్న పొరపాట్లను సరిదిద్దుకునేందుకు ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. గ్రామంలో 107 సర్వే నంబర్లలో 953.21 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. అందులో ప్రభుత్వ భూమి 154.03 ఎకరాలు, జిరాయితీ 465 ఎకరాలు, అటవీ శాఖ భూములు 322 ఎకరాలు, డీ పట్టా భూములు 10 ఎకరాలు, ఎండోమెంట్ భూములు 0.64 సెంట్లు ఉన్నట్లు వెల్లడించారు. ఈ సదస్సులో రైతుల నుంచి 59 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, వైస్ ఎంపీపీ ఝాన్సీ లక్ష్మీరాణి, రీ సర్వే డీటీ గణేష్, మండల సర్వేయర్ లాలం అప్పారావు, గ్రామ పెద్దలు పాలిశెట్టి సురేష్ రాజ్, శరగడం రాము, ఆడారి నాగరాజు, బంగారయ్య, పొల్లుణ, నరసింగరావు, వెంకట్, వీఆర్వో అప్పలరాజు, సర్వేయర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పశు గణన పోస్టర్ ఆవిష్కరణ

సబ్బవరం: పశు సంవర్ధక శాఖ చేపడుతున్న 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమానికి సంబంధించి గోడపత్రికను స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాల అవరణలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావుతో కలిసి పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.ఉషాకుమారి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఇంట్లో ఉన్న పశువులను లెక్కించేందుకు ఈ పశు గణన చేపడుతున్నట్లు తెలిపారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు తదితర అన్నిరకాల పశువులు, జీవాల వివరాలను సేకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు.

- రావలమ్మపాలెంలో అంతకాపల్లి పశువైద్యాధికారి డాక్టర్ జి.అరుణ ఆధ్వర్యంలో పశు గణన పోస్టర్‌ను ఆవిష్కరించారు. పశు సంపద ఉన్న ప్రతి ఒక్కరూ వివరాలు అందించి, తమకు సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, గొర్లి చైతన్య, యర్రిశెట్టి రాము, సబ్బవరపు రమణ, పల్ల రమణ తదితరులు పాల్గొన్నారు.



అంతకాపల్లిలో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న డాక్టర్ అరుణ, తదితరులు

నేడు చినముషిడివాడలో ఎంపీ రమేష్ పర్యటన

పెందుర్తి: అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ శనివారం చినముషిడివాడలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు చినముషిడివాడ కూడలి వద్ద జరగనున్న కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు ఎంపీ సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నట్లు ఎంపీ కార్యాలయ ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు



ఇరువాడ ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం: మండంలోని ఇరువాడ రెవెన్యూ పరిధి ప్రభుత్వ భూమి ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు స్పందించారు. సర్వే నెం.139/1లో ప్రభుత్వ వాగు పోరంబోకు స్థలం అక్రమణకు గురైందని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గ్రామ సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మి, కనకరాజులు ఇటీవల ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఓ కుటుంబం అక్రమణకు పాల్పడి తమకు డి–పట్టా ఉన్నట్లు తప్పుదారి పట్టిస్తున్నట్లు అర్జీలో పేర్కొన్నారు. విలువైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని, అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని కోరారు. సదరు ఫిర్యాదుపై తహసీల్దార్ బి.చిన్నికృష్ణ ఆదేశాల మేరకు ఆర్ఐ వీరయ్యతో పాటు సిబ్బంది వెళ్లి, ఆక్రమిత స్థలంలో హెచ్చరికల బోర్డు ఏర్పాటు చేశారు.

అధికారులు రాకుంటే సమస్యలు చెప్పేదెవరికి?



హాజరైన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు



మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

- భూ ఆక్రమణలు, గ్రావెల్ తవ్వకాలపై చర్యలేవి?
- మండల పరిషత్ సమావేశంలో మండిపడ్డ ఎంపీపీ నాగమణి

పెందుర్తి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు తరచూ రెవెన్యూ, గనులశాఖ ఉన్నతాధికారులు గైర్హాజరు కావడంపై ఎంపీపీ మధుపాడ నాగమణి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అధికారులు ముఖ్యమైన సమావేశాలకు హాజరు కాకపోతే సంబంధిత శాఖల సమస్యలు ఎవరికి చెబుతామని ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ మండలంలో పలు గ్రామాల్లో గ్రావెల్ తవ్వకాలతో పాటు ప్రభుత్వ భూముల ఆక్రమణలు పెరిగిపోయాయన్నారు. వాటిపై ఫిర్యాదులు చేస్తే పట్టించుకు నాథుడే లేడని ఆక్షేపించారు. గత కొన్ని సమావేశాలకు మండల తహసీల్దార్, గనుల శాఖ అధికారులు కావాలనే డుమ్మా కొడుతున్నట్లుందని అసహనం వ్యక్తం చేశారు. కిందిస్థాయి సిబ్బంది వస్తున్నా వారికి చెబితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లం లేదన్నారు.

వచ్చే సమావేశానికి అన్ని విభాగాల అధికారులు హాజరయ్యేలా చూడాలని ఇన్‌చార్జి ఎంపీడీవోకు సూచించారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పలు అంశాలపై మాట్లాడారు. జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరావు, పలు విభాగాల అధికారులు హాజరయ్యారు.

రసాయన వ్యర్థాలతో మొల్లేటిగెడ్డలో దుర్గంధం



మొల్లేటి గెడ్డలో నిలిచిన రసాయన వ్యర్థాలు

పరవాడ: భర్నికం సమీపంలోని మొల్లేటి గెడ్డ రసాయన వ్యర్థాలతో నిండిపోవడం వలన రైతులతో పాటు రహదారి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలు ఇష్టానుసారంగా విడుదల చేస్తున్న రసాయన వ్యర్థ జలాలు మొల్లేటిగెడ్డలో వచ్చి చేరుతున్నాయి. దీంతో సమీపంలోని పొలాల్లో వేసిన పంటలు నాశనమవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రసాయ వ్యర్థాలతో భూగర్భ జలాలు కూడా కలుషితమవుతున్నాయని ఆరోపిస్తున్నారు. గెడ్డలో నిలిచిన రసాయన వ్యర్థాలు భరించలేని దుర్వాసన వెదజల్లడంతో ప్రజలు తరచూ అనారోగ్యానికి గురువుతున్నారని స్థానికులు చెప్తున్నారు. ఈ ఇబ్బందుల్ని గుర్తించి, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు గెడ్డలో రసాయ వ్యర్థాలు విడుదల చేయకుండా ఫార్మా సంస్థల్ని నియంత్రించాలని కోరుతున్నారు.